GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 258 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం 18-2025 | పేజీలు : 3

## చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్

- ఏపీ కేబినెట్ ఆమోదం

**టి మీడియా, మార్చి 17,అమరావతి:**



రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు, రాజధాని అమరావతిలో భూ కేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. అలాగే ఎస్సీ వర్గీకరణ అంశంపై ఇటీవల రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నంబూరులో వీవీఐటీయూకు ప్రైవేటు యూనివర్సిటీ హోదా కల్పిస్తూ నిర్ణయం, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటు, పలు సంస్థలకు భూ కేటాయింపులు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరు ఇకపై తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# అబద్ధాల పునాదుల ప్రభుత్వాన్ని నడపం


- మంత్రులను తొలగిస్తేనే పాలనపై పట్టున్నట్లా?
- సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా,మార్చి 17,హైద్రాబాద్ బ్యూరో:**

అసెంబ్లీ ఆవరణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికి రూ.4లక్షల వరకు ఆర్థికసాయం అందుతుంది. యువ వికాసానికి నేటి నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఏప్రిల్ 6 నుంచి మే 30 వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్లు మంజూరు చేస్తారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్ : తొలి ఏడాదిలోనే 54 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్న సీఎం రేవంత్ రెడ్డి తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే మహిళలకు 1.20 కోట్ల చీరలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. స్వయంసహాయక సంఘాల్లోని 63 లక్షల మంది మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళలకే పాఠశాలల నిర్వహణ బాధ్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

### ఉద్యోగాలు భర్తీ

తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారని, మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా?, అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లా? అని ప్రశ్నించారు. అన్నింటిని సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే తన విధానమని, అందరికీ ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని, ప్రభుత్వ పథకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని



తమ ఎమ్మెల్యేలకు చెప్తుంటానని వెల్లడించారు. కార్యకర్తలకే ఇవ్వాలంటే పార్టీ పదవులు ఇద్దామని చెప్తుంటానని, ప్రభుత్వ పథకాల విషయంలో మాత్రం పార్టీలను చూడొద్దని చెప్తున్నానని అన్నారు. అసలైన అర్హులకు పథకాలను తప్పక వర్తింపచేయాలని అధికారులను చెప్తుంటానని తెలిపారు.నాకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారు. మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లా? అన్నింటిని సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే నా విధానం. అందరికీ ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే మా లక్ష్యం.దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉంది : స్వాతంత్ర్యం వచ్చి ఈ 75 ఏళ్లు పూర్తయినా ఇప్పటివరకు దేశంలో కులగణన జరగలేదని, సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్‌గాంధీ చెప్పారని సీఎం అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టామని, ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా ఉద్యమం సాగుతోందని, దశాబ్దాలుగా నానుతున్న ఎస్సీ వర్గీకరణపై కూడా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. అబద్ధాల పునాదుల మీద మేము ప్రభుత్వాన్ని నడపలేమని అన్నారు. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడిందని ఆరోపించారు. దుబారా ఖర్చులను తగ్గించుకుంటూ అప్పులు చెల్లిస్తున్నామని, ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.3 కోట్లు పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైందని, ధరల పెరుగుదలను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని వివరించారు.

### రాజ్యాంగ సవరణ

సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై కులగణన చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో ప్రవేశపెట్టింది తీర్మానం కాదని బిల్లు అని స్పష్టం చేశారు. చట్టపరంగా సాధించుకునేందుకు నాయకత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈసారి 4 ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఇచ్చామని ఆయన అసెంబ్లీలో గుర్తు చేశారు.

### వారికి ధన్యవాదాలు

1979లో మండల్ కమిషన్ వేశారని, మండల్ కమిషన్‌తోనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ప్రారంభమైందని సీఎం అన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించామని గుర్తు చేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఏడాదిలోపు ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మద్దతు ఇస్తున్న అందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు.


### మోదీ, రాహుల్‌గాంధీని కలుద్దాం

కేంద్రం నుంచి అంగీకారం కోసం పోరాడుతానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసేందుకు అన్ని పార్టీల నేతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ జరగాలని వెల్లడించారు. అవసరమైన రాజ్యాంగ సవరణ జరిగేలా అందరం కలిసి పోరాడుదామని, పార్లమెంటులో చట్టం కోసం మోదీ, రాహుల్‌గాంధీని కలుద్దామని అన్నారు.


## 10 సూత్రాలు నిర్దేశించుకున్నాం

- స్వర్ణాంధ్ర విజన్ వైపు అడుగులేస్తున్నాం
- సీఎం చంద్రబాబు

**టీ మీడియా, ఫిబ్రవరి 17, అమరావతి:**



2047 విజన్ డాక్యుమెంట్‌పై శాసనసభలో లఘు చర్చ జరిగింది. విజన్ డాక్యుమెంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్?లో పెట్టగలిగామని సీఎం వెల్లడించారు. దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 1990ల్లో సమైక్య ఆంధ్రప్రదేశ్?కు విజన్ 2020 తీసుకువచ్చామని గుర్తు చేసారు. చెప్పిన దానికంటే ఎక్కువ ప్రయోజనమే ఉమ్మడి రాష్ట్రానికి కలిగిందన్నారు.2047 వికసిత్ భారత్?ను ప్రధాని మోదీ అమలు చేస్తున్నారు. అందుకే ఏపీ కూడా అభివృద్ధి దిశగా అడుగులేసేందుకు స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. ఎమ్మెల్యేలను భాగస్వాములు చేస్తూ నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్లను కూడా రూపొందించామన్నారు. 2047 నాటికి ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారటమే లక్ష్యమని స్పష్టం చేసారు. అలాగే 308 లక్షల కోట్ల రాష్ట్రస్థూల ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు చేశామన్నారు.ప్రతీ ఏటా 15 శాతం వృద్ధి రేటుతో 55 లక్షల తలసరి ఆదాయం సాధించేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించామని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. మొత్తంగా జీఎస్డీపీ 18 ,65,704 కోట్ల మేర , తలసరి ఆదాయం 3.47 లక్షల లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు.ఇంగ్లీష్ అనేది కేవలం కమ్యూనికేషన్ భాష మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషలో చదివి రాణించిన వారే ఎక్కువ అని అన్నారు. భాష ద్వేషించడానికి కాదు ఉపాధి కోసం ఎన్నో భాషలు నేర్చుకోవాలన్న సీఎం, దీనిపై లేని పోని రాజకీయాలు చేయటం సరికాదని హితవు పలికారు. నియోజకవర్గాల వారీగా విజన్ అమలు జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే చైర్మన్?గా ఈ కమిటీ నియామకం అవుతుందన్నారు. ఒక ఎంబీఏ చదివిన నిపుణుడ్ని కూడా విజన్ అమలు కోసం నియమిస్తామని సీఎం తెలిపారు. అలాగే ఈ విజన్ లక్ష్యాల సాధన కోసం ర్యాంకింగ్ లు కూడా ఉంటాయన్నారు.ప్రతీ మూడు నెలలకూ కలెక్టర్ల కాన్ఫరెన్సుల్లో దీనిపై సమీక్ష కూడా చేస్తామని తెలిపారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై సర్వేలు కూడా నిర్వహించి అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. రియల్ టైమ్ పీ4 డాష్ బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలను కూడా రియల్ టైమ్?లోనే భాగస్వామ్యులను చేస్తున్నామని సీఎం వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను తీసుకునే నిర్ణయాల్లో మార్పు చేర్పులు చేస్తామన్నారు. పీ4ను ఉగాది రోజు నుంచి ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. మొత్తంగా 35 లక్షల మంది పేదరికంలో ఉంటే మొదటి దశలో 20 లక్షల మంది రెండో దశలో 15 లక్షల మందిని పెడతామన్నారు. వీరికి చేయూత ఇచ్చేందుకు వీలుగా జాబితాను కూడా సిద్ధం చేస్తామన్నారు. నియోజకవర్గాల వారీగా పీ4 కార్యక్రమం సక్రమంగా అమలు కావాలని తెలిపారు. 2029న ప్రజలకు ఏం చేస్తామో చెప్పి ఎన్నికలకు వెళదామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.



## తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై రగడ

- క్లారిటీ ఇచ్చిన సీఎం రేవంత్

**టీ మీడియా, మార్చి 17,హైదరాబాద్:**

ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు త్వరలో మారనుంది. బదులుగా ప్రముఖ తెలంగాణ కవి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును ఆ యూనివర్సిటీకి పెట్టనున్నారు. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయం చట్టానికి సవరణ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 15న అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టగా.. మంత్రి మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గత సెప్టెంబరు 20న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సురవరం పేరు పెట్టాలని నిర్ణయించగా.. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేశాఉ. పదో షెడ్యూల్‌లో ఈ వర్సిటీ ఉండటంతో ఇప్పటివరకు పేరు మార్చలేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కేవలం తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ఈ యూనివర్సిటీలో ప్రవేశాలను పరిమితం చేశారు. దీంతో 1985 డిసెంబరు 2న స్థాపించిన తెలుగు యూనివర్సిటీ పేరును రేవంత్ ప్రభుత్వం మార్చింది.తెలంగాణ వచ్చాక అనేక వర్సిటీలకు పేర్లు మార్చుకున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి - ఒకే పేరుపై రెండు రాష్ట్రాల్లో రెండు వర్సిటీలు ఉండకూడదనే పేరు మారుస్తున్నామని వెల్లడి

**ఆయనను అవమానించడమే'**

తెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని శ్రీరాములు జయంతి సందర్భంగా కేంద్ర బండి సంజయ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు. అలాంటి మహనీయుని పేరును తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సురవరం ప్రతాప్‌రెడ్డి అంటే మాకు గౌరవం ఉంది. ఆయన తెలుగు భాష ఉన్నతికి కృషి చేశారు. తెలుగు భాషాభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పేరును జరిపితే బాగుంటుంది. కానీ వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం ఆయనను అవమానించడం అవుతుంది. ఆంధ్రా మూలాలు ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించిన కాంగ్రెస్ సర్కారు.. ఎన్టీఆర్ పార్కు, కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి పార్కుల పేర్లను, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం పేరును మార్చగలదా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం తమ తప్పిదాన్ని సరిదిద్దుకొని తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడంపై ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు.

**ఎవరీ సురవరం?**

రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడుకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న జన్మించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో

మిగతా 3లో..

# బంగారం ఎగిరి వస్తోంది

- ఏజెంట్లకు ప్రయాణ చార్జీలు
- భారీగా కమీషన్లు

**టీ మీడియా, మార్చి 17, ఢిల్లీ :**



రోజురోజుకు పుత్తడి ధర పెరుగుతోంది. భవిష్యత్తులో ఇంకెంతకు చేరుతుందో అంచనా వేయటం సవాల్‌గా మారిన పరిస్థితుల నేపథ్యంలో ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు స్మగ్లర్లు సిద్ధమయ్యారు. గల్ఫ్ దేశాల్లో చౌకగా దొరిగే బంగారాన్ని విమానాల్లో ఇక్కడికి తరలిస్తున్నారు. పేదలు, వారి అవసరాలను ఆసరా చేసుకుని స్మగ్లర్లుగా రంగంలోకి దింపుతున్నారు.బంగారం ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్న తరుణంలో గల్ఫ్‌దేశాల నుంచి ఇక్కడికి పెద్దఎత్తున బంగారం స్మగ్లింగ్ జరుగుతోంది. ఏజెంట్లుగా పనిచేసిన వారికి ఎంతో కొంత కమీషన్ ఇచ్చి దొంగ బంగారాన్ని అధిక ధరకు విక్రయిస్తుంటారనేది బహిరంగ రహస్యం. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో స్మగ్లర్లకు సహకరిస్తుంటారనే ఆరోపణలున్నాయి.బంగారం ధర తులం 80వేల మార్కును దాటి పోయింది. భవిష్యత్తులో ఇంకెంత పెరుగుతుందో అంచనా వేయటం సవాల్‌గా మారింది. ఇదే సమయంలో స్మగ్లర్లు రంగ ప్రవేశం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతను లక్ష్యంగా చేసుకొని బంగారం అక్రమంగా తరలిస్తున్నారు. హైదరాబాద్ నగర శివారున ఉండే ఆటోడ్రైవర్ కొద్దిరోజుల క్రితం ఏజెంట్ సాయంతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేశాడు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన పోలీసులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. బంగారం స్మగ్లర్లు పాస్?పోర్టుకు దరఖాస్తు చేయించారని, వారు చెప్పిన ప్రాంతానికి వెళ్లి తీసుకొచ్చి ఇస్తే ప్రయాణ ఖర్చులు, కమీషన్ ఇస్తామని ఆశచూపినట్టు తేలిందని పోలీసు అధికారి వెల్లడించారు.

### ఇప్పుడేం జరుగుతోందంటే

హైదరాబాద్?లోని శంషాబాద్ విమానాశ్రయంలో ఏటా రూ.కోట్ల విలువైన బంగారం కస్టమ్స్ అధికారులకు పట్టుబడుతోంది. తీసుకొచ్చిన వారిని ప్రశ్నిస్తే తమకేం తెలియదంటూ సమాధానమిస్తున్నా నగరంలోని దళారులు గల్ఫ్ దేశాల్లోని ట్రావెల్ ఏజెంట్లతో ఉన్న పరిచయాలతో తక్కువ ధరకు బంగారం కొనుగోలు చేసి ఇక్కడకు తరలిస్తున్నారు.ఇందుకు అవసరమైన ఏజెంట్లను స్థానిక దళారులు ఎంపిక చేసుకుని విదేశాలకు వెళ్లొచ్చేందుకు ప్రయాణ ఖర్చులకు తోడు రోజుకు 3వేల రూపాయలు, సురక్షితంగా బంగారం తీసుకొస్తే రూ.50వేల వరకూ కమీషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు. ఇలా ఏజెంట్లుగా మారే వారిలో ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు, కూలీలు, యువకులు అధికశాతం ఉంటారని పోలీసులు తెలిపారు.

### తనిఖీలు తప్పించి

హైదరాబాద్ నుంచి విమానంలో గల్ఫ్‌దేశాలకు పంపించి వారి వివరాలను అక్కడి ట్రావెల్ ఏజెంట్లకు చేరవేస్తారు. అక్కడి ముఠా తాము సేకరించిన బంగారాన్ని వివిధ రూపాల్లోకి మార్చి ఏజెంట్లకు ఇచ్చి అక్కడి విమానాశ్రయాల్లో తనిఖీల నుంచి తప్పించి విమానం ఎక్కిస్తారు. తీరా ఇక్కడికి వచ్చాక ఎయిర్‌పోర్టు సమీపంలో దళారులు ముఠా ఏజెంట్ల నుంచి బంగారం స్వాధీనం చేసుకుంటారు. కమీషన్ ముట్టజెప్పి ఇంటి వద్దకు చేర్చుతారు. కాగా, ఏజెంట్లు పట్టుబడినా తమ వివరాలు బయటపడకుండా దళారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు.

## నిరుద్యోగులకు రూ.3లక్షల ప్రభుత్వ రుణం

- ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

**టీ మీడియా,మార్చి 17,హైద్రాబాద్ బ్యూరో:**



తెలంగాణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. ఈ స్కీమ్ కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు ప్రయోజనం కలగనుంది. రాజీవ్ యువ వికాస పథకం ద్వారా ప్రభుత్వం రాయితీతో రుణాలు అందించనుంది. దాదాపు 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల రాయితీలు అందించనున్నట్లు తెలుస్తోంది.రాజీవ్ యువ వికాసం పథకం కింద మూడు క్యాటగిరీలుగా లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చనుంది. క్యాటగిరీ-1 కింద లక్ష వరకు రుణం అందిస్తుంది. అందులో 80 శాతం రాయితీ ఉంటుంది. క్యాటగిరీ-2 కింద లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అందులో 70 శాతం రాయితీ కల్పిస్తుంది. క్యాటగిరీ-3 కింద 2 లక్షల నుంచి 3 లక్షల లోపు రుణాలను పొందవచ్చు. అందులో 60 శాతం రాయితీ లభిస్తుంది. రాజీవ్ యువవికాసం పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుండటంతో యువత నుంచి భారీసంఖ్యలో అర్జీలు వచ్చే అవకాశముందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ దాదాపు రూ.1200 కోట్లు, గిరిజన ఆర్థిక సహకార సంస్థ రూ.360 కోట్లతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాయి. మరోవైపు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలో ప్రత్యేక అభివృద్ధి నిధులు భారీగా ఉన్నందున ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీసీల్లో అత్యధిక మందికి లబ్ధి చేకూర్చేలా బీసీ కార్పొరేషన్ కార్యాచరణ ప్రణాళికను ఆమోదించింది.

## తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం

- మార్చి 24 నుండి అమలు

**టీ మీడియా, ఫిబ్రవరి 17, తిరుమల:**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనాన్ని టిటిడి కల్పించనుంది. ఈ విధానం మార్చి 24 నుండి అమల్లోకి రానుంది.ఇందులో భాగంగా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి తెలంగాణ ప్రజా ప్రతినిధుల నుండి సిఫార్సు లేఖలను ఆది, సోమ, వారాల్లో మాత్రమే స్వీకరించడం జరుగుతుంది. (సోమ, మంగళవారం దర్శనాలకు గాను) అదేవిధంగా రూ. 300 దర్శనం టికెట్లకు సంబంధించి సిఫార్సు లేఖలను బుధ, గురు వారాలలో మాత్రమేలిస్వీకరించడం జరుగుతుందని (ఏ రోజు కా రోజు దర్శనం) తెలియజేయడమైనది. (ఒకరికి ఒక సిఫార్సు లేఖను మాత్రమే 06 మందికి మించకుండా స్వీకరించడం జరుగుతుంది).ఇప్పటివరకు సోమవారం విఐపి బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఆంధ్ర ప్రజా ప్రతినిధుల నుండి స్వీకరిస్తున్న సిఫార్సు లేఖలు ఇకపై శనివారం నాడు (ఆదివారం దర్శనం కొరకు)లి స్వీకరించబడతాయి.తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలను, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో ఉంచుకుని సుదీర్ఘంగా చర్చించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం టిటిడి ఈ మేరకు నిర్ణయించింది.ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని టీటీడీకి సహకరించవలసిందిగా కోరడమైనది.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ పై యాక్షన్

- హర్షసాయి, సన్నీ సహా 12 మందిపై కేసులు

**టీ మీడియా,మార్చి 17,హైద్రాబాద్ బ్యూరో :**



బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా ఆ యాప్?లను ప్రమోట్? చేస్తున్న సోషల్? మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో పాటు పలువురు టీవీ నటులపై కేసులు నమోదయ్యాయి. ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, శ్యామల, రీతూ చౌదరి, సుప్రీత, అజయ్, సన్నీ యాదవ్, సుధీర్, సందీప్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిపై బీఎన్ఎస్-318(4) 3,3(ఏ), 4టీఎస్‌జీఏ, 66డీఐటీఏ-2008 సెక్షన్ల కింద కేసు నమోదయ్యాయి.

**కట్టడి చేయడంలో సజ్జనార్ కృషి**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ఇటీవల కాలంలో కొంత మంది సోషల్? మీడియా ఇన్?ఫ్లూయన్సర్లు ప్రచారం చేస్తున్నారు. వాటివల్ల అమాయక యువత తప్పుదోవ పట్టి డబ్బులను నష్టపోతున్నారు. ఇలాంటి వాటివల్ల

మిగతా 3లో..

# రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలనకు యాప్

- అన్నీ చెక్ చేశాకే కొత్త కార్డు



**టీ మీడియా,మార్చి 17,హైద్రాబాద్ బ్యూరో :**
మొబైల్ యాప్‌లో దరఖాస్తుల విచారణ అనంతరం ఆర్ఐ నుంచి తహసీల్దార్‌కు, అక్కడి నుంచి డీఎస్వో లాగిన్‌కు రేషన్ కార్డు దరఖాస్తుదారుల వివరాలు వెళ్తాయి. మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ లాగిన్ నుంచి మున్సిపల్ కమిషనర్‌కు, అక్కడి నుంచి డీఎస్వో లాగిన్‌కు వస్తాయి. వీటన్నింటినీ డీఎస్వో పౌర సరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు ఆన్‌లైన్‌లో సమర్పిస్తారు. కార్డుల మంజూరు వివరాలు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్థాయిలో వెల్లడి కానున్నాయి.

**ప్రత్యేక మొబైల్ యాప్**
రేషన్ కార్డుల కోసం చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను సైతం రూపొందించారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో వీలైనంత త్వరగా అప్‌డేట్ చేయనున్నారు. మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందే : ప్రజా పాలన గ్రామ సభల్లో ఫిబ్రవరి 18 నాటికి రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల సంఖ్యలో దరఖాస్తులు అందాయి. ఈ వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆయా దరఖాస్తుల పరిశీలన బాధ్యతను మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు అప్పగించనున్నారు. మండలాల్లో అయితే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ) చేయనున్నారు. ఎంపిక చేసిన ఆర్ఐలు, వార్డు అధికారులు తమ మొబైల్ ఫోన్‌లో ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**ఇళ్లకు వెళ్లి మరీ విచారణ**
వారికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సంబంధిత అధికారులు కేటాయించనున్నారు. దరఖాస్తులు యాప్‌లో లభ్యమవుతాయి. వాటి ఆధారంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేయనున్నారు. ఇందుకు కచ్చితమైన మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఊహించిన దాని కంటే ఎక్కువగానే వచ్చినట్లు అధికారులు చెప్పారు.

**తప్పుల సవరణ**
రేషన్ కార్డులో పేరు నమోదు చేయాలని, తప్పులు సవరించాలని కోరుతూ కొన్నేళ్లుగా మీసేవ కేంద్రాల్లో వేలాది మంది అప్లికేషన్ పెట్టుకున్నారు. ఇలాంటి దరఖాస్తులు రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి ఆర్ఐ, తహసీల్దార్, డీఎస్వో లాగిన్‌లో వేర్వేరు దశల్లో ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం సాధ్యమైనంత మేరకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. కొత్త కార్డులు జారీ చేసిన అనంతరం ఈ దరఖాస్తుల పరిశీలన అవసరం ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, మార్చి 17, వనపర్తి బ్యూరో :**
ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనప కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య ,ఆర్డీవో సుబ్రహ్మణ్యంలతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదు దారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ప్రజావాణికి మొత్తం 43 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఎంపీ డీకే అరుణకు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్

**టీ మీడియా,మార్చి 17,హైద్రాబాద్ బ్యూరో:**
డీకే అరుణ ఇంట్లో ఆగంతకుడు చొరబడిన ఘటనపై ఆరా తీసిన రేవంత్ రెడ్డి.. ఘటన జరిగిన తీరును, తన అనుమానాలను రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చిన డీకే అరుణ భద్రత పెంచుతామని డీకే అరుణకు హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, భద్రత పెంచాలంటూ పోలీసు శాఖకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం. జరిగిన ఘటనపై విచారణ వేగవంతం చేసి వాస్తవాలు తేల్చాలని పోలీస్ శాఖకు ఆదేశం. గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఇంట్లో చోరీ జరిగితే పట్టించుకొని రేవంత్ రెడ్డి, బీజేపీ ఎంపీ ఇంట్లో చోరీ జరిగితే ఎంపీని ఫోన్లో పరామర్శించారని విమర్శిస్తున్న నాయకులు.

## తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై రగడ

**(మొదటిపేజీ తరువాయి...)**
న్యాయవాద విద్య అభ్యసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. 1952లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా హైదరాబాద్ స్టేట్ శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏడాదే 1953 ఆగస్టు 25న ఆయన మృతి చెందారు. ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్రకు 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది.తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై విశ్వవిద్యాలయాలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దాన్ని పరిష్కరించేందుకే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, సంస్థలకు తెలంగాణకు సంబంధించిన పేర్లు పెడుతున్నామని చెప్పారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ, తెలుగు వర్సిటీ పేరు మార్పు తదితర బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో రేవంత్? మాట్లాడారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్రానికి ప్రతిపాదిస్తున్నట్లు గుర్తు చేశారు.

**పరిపాలనా సౌలభ్యం కోసమే**
తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అనేక విశ్వవిద్యాలయాల పేర్లు మార్చుకున్నామని సీఎం గుర్తు చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే కొన్ని వర్సిటీలకు ప్రొఫెసర్ జయశంకర్, పీవీ నరసింహారావు, కొండా లక్ష్మణ్ బాపూజీ, కాళోజీ నారాయణరావు పేర్లు పెట్టుకున్నామని అన్నారు. అదే ఒరవడిలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెడుతున్నామని, తెలంగాణ సమాజానికి ఆయన ఎంతో సేవ చేశారని తెలిపారు. గోల్కొండ పత్రికను సురవరం నడిపారని, నిజాంకు వ్యతిరేకంగా పోరాడారని, పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్చడం ఎవరికీ వ్యతిరేకం కాదని తెలిపారు.దివంగత మాజీ సీఎం రోశయ్య, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, విశ్వాసం, నమ్మకం ఉందని అన్నారు. మతం, కులం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవడం సరికాదని సూచించారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేఖ రాస్తానని, దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకుందామని అన్నారు. ఈ మేరకు కేంద్రం నుంచి అనుమతి తీసుకురావాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కోరుతున్నానని పేర్కొన్నారు.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ పై యాక్షన్

**(మొదటిపేజీ తరువాయి...)**
సమాజానికి జరిగేనష్టం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు ఆర్టీసీ ఎండీ సజ్జనార్. బెట్టింగ యాప్ ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ నెల 21న సజ్జనార్‌తో సహా కొంతమంది సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్‌చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేయడం విశేషం. కొద్ది రోజుల క్రితమే యువతను తప్పుతోవ పట్టించే విధంగా బెట్టింగ్ యాప్?లను సామాజిక మాధ్యమాల్లో ప్రమోట్ చేస్తున్నాడనే కారణంతో యూట్యూబర్ సన్నీయాదవ్?పై పోలీసులు కొద్ది రోజుల క్రితం కేసు నమోదు చేశారు.



## బిఆర్ఎస్ ఎమ్మెల్సీల వినూత్న నిరసన

- మిర్చి దండలు వేసుకొని

**టీ మీడియ,మార్చి 17,హైదరాబాద్:**
మిర్చి రైతులు సమస్యలు పరిష్కరించాలని 25వేల గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ఎమ్మెల్సీలు.తెలంగాణ రాష్ట్రం లో గత సీజన్లో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు అయింది.. ధర లేక ఈ సీజన్లో 2లక్షల 40 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గిపోతోంది అని ఆందోళన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి నాఫెడ్, మార్క్ ఫెడ్ ద్వారా మిర్చి మద్దతు ధర క్వింటాల్ కు ఇరవై ఐదు వేల రూపాయలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని,
తెలంగాణ మిర్చి పంటలు విదేశీ ఎగుమతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీల డిమాండ్.తెలంగాణ మిర్చి పంటను సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి ఆహార పంటల జాబితాలో చేర్చాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీల డిమాండ్ చేసారు.



## ఉచిత సామూహిక వివాహాలు

**టీ మీడియా మార్చి 17 మక్తల్**
నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండలం నేరడగం గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం సిద్ధ లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పంచమసిద్ధ లింగం మహాస్వామి ఆధ్వర్యంలో 14 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు. ఇట్టి సామూహిక వ్యవహాల్లో ముఖ్యఅతిథిగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# రూ.ఐదు లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు



**టీ మీడియా,మార్చి 17,ఘట్కేసర్:**
భువనేశ్వర్ నుంచి ముంబాయికి కోణార్క్ రైల్లో అక్రమంగా రవాణవుతున్న 10 కేజీల గంజాయిని సోమవారం హెచ్ టి ఎఫ్ డీ టీమ్ పోలీసులు పట్టుకున్నారు.
ఒరిస్సాకు చెందిన దాంపా ప్రధాన్ అనే గంజాయి వ్యాపారీ ముంబాయికి 10 కిలోల గంజాయిని తరలించడానికి నందిగోస నాహక్(21) అనే వ్యక్తి ఎంచుకొని అతడితో 10 కేజీలగంజాయినితరలించడానికి ఏర్పాటు చేశాడు.భవనేశ్వర్ నుంచిముంబాయిలో గంజాయి ఇచ్చి వచ్చినందుకు నాహక్‌కు రూ. 15 వేలు ఇస్తానని ఒప్పందాంకుదుర్చుకున్నారు.కోణార్క్ రైల్లో పోలీసుల తనిఖీలు జరుగుతున్నాయనే సమాచారంతో కోణార్క్ దిగి కాకతీయ రైలు నా హగ్ ఎక్కాడు. కాకతీయ రైల్లో కూడ తనిఖీలు జరుగుతున్నాయనే భయంతో ఘట్కేసర్ రైల్వే స్టేషన్‌లో గంజాయితో దిగాడు.
బస్సు మార్గంలోకాని.. మరో రైల్లో ముంబాయికి వెలుదామని ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఎస్ టి ఎఫ్ డీ టీమ్ సీఐ నాగరాజ్, ఎస్సై జ్యోతి సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న రూ. 5 లక్షల విలువ చేసే 10 కేజీలగంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడు నందిగోస నాహక్, ఆతడి వద్ద ఉన్న సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు.గంజాయిని పట్టుకున్న టీమ్‌లో కానిస్టేబుళ్లు లేఖాసింగ్, వినోద్, కాశీలు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌ను ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తిరుపతి యాదవ్‌లు అభినందించారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**టీ మీడియా,మార్చి 17హైదరాబాద్ :**
వివిధ రంగాల్లో సేవలందిం చిన ప్రతిభావంతులకు ప్రదానం చేసే దేశ అత్యు న్నత పౌర పురస్కారాలు 'పద్మ' అవార్డ్స్ కోసం కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. 2026 సంవత్సరానికి సంబంధిం చిన పద్మ అవార్డుల కోసం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించింది. అర్హత ఉన్నవారు జులై 31 లోగా నామినేషన్లు, సిఫా ర్సులు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం వెల్లడిం చింది. దేశంలోని రెండు అత్యున్నత పౌరపురస్కా రాలైన భారతరత్న, పద్మ అవార్డులను కేంద్ర ప్రభుత్వం 1954లో ప్రారంభించింది. భారత్ తో పాటు వివిధ దేశాలకు చెందిన వారికి సైతం అవార్డులను కేంద్రం ప్రకటిస్తుంది. వివిధ రంగా ల్లో ప్రతిష్ఠాత్మక, అసాధా రణ సేవలు అందించినం దుకు అవార్డులతో సత్కరి స్తుంది. ఈ అవార్డులను ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తుండ గా.. మార్చి, ఏప్రిల్లో రాష్ట్ర పతి చేతులమీదుగా అందజేస్తారు





# కేంద్రానికి 3 నెలల టైమ్

- నాలుగు రాష్ట్రాల్లో 'డీలిమిటేషన్'కు సుప్రీంకోర్ట్


**టీ మీడియా, మార్చి 17, ఢిల్లీ :**
లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాడివేడి చర్చ జరుగుతోంది. ఈ తరుణంలో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్?ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, అసోంలలో డీలిమిటేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మూడు నెలల సమయాన్ని మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వినతిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం సానుకూలంగా పరిగణించింది. ఆ నాలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టేందుకు మరో మూడు నెలల సమయాన్ని కేటాయించింది. ఈ అంశంపై తదుపరి విచారణను జులై 21వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర సర్కారుకు నిర్దేశించింది.

**గతంలో ఏం జరిగిందంటే?**
గతంలో ఇదే అంశంపై వాదనలను వినే క్రమంలో డీలిమిటేషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అరుణాచల్?ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, అసోంలలో డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయరాదంటూ 2020లో రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడినప్పటికీ, ఈ విషయంలో జాప్యం జరగడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అప్పట్లో సుప్రీంకోర్టుకు కేంద్రం బదులిస్తూ, "అరుణాచల్, నాగాలాండ్‌లలో డీలిమిటేషన్‌పై మేం ఇప్పటికే సంప్రదింపుల ప్రక్రియను మొదలుపెట్టాం. హింసాకాండ కారణంగా మణిపూర్‌లో ఈ విషయంలో ముందడుగు వేయలేకపోతున్నాం" అని తెలిపింది.

**పిటిషనర్ వాదన ఇదీ!**
2020 ఫిబ్రవరి 28న జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి ఈ నాలుగు రాష్ట్రాల్లో త్వరితగతిన డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలంటూ రెండేళ్ల క్రితం ఒక ఈశాన్య రాష్ట్ర సామాజిక సంస్థ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ విచారణ జరుగుతోంది. పిటిషనర్ తరఫున అడ్వకేట్ జి.గాంగ్‌మీ వాదనలు వినిపిస్తున్నారు. "డీలిమిటేషన్ ప్రక్రియ విషయంలో 2023 ఆగస్టు వరకు అసోంలో కొంత పురోగతి జరిగింది. కానీ మిగతా ఈశాన్య రాష్ట్రాల్లో దీనిపై కేంద్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టడం లేదు. ఈ విధంగా ఒక్కో ఈశాన్య రాష్ట్రానికి ఒక్కో విధమైన విధానాన్ని అమలు చేయడం సరికాదు. ఇలా చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వ హక్కుకు భంగం కలిగించినట్టే. 2002లో డీలిమిటేషన్ సవరణ చట్టం చేసినప్పటి నుంచి అరుణాచల్?ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, అసోంలలో డీలిమిటేషన్ జరగలేదు. దీనివల్ల ఆయా రాష్ట్రాలు నష్టపోతాయి" అని జి.గాంగ్‌మీ వాదిస్తున్నారు.

# వాలంటీర్ల వ్యవస్థ లేదని ప్రభుత్వం ప్రకటన

- మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆగ్రహం



**టీ మీడియా,మార్చి 17,అమరావతి:**
వాలంటీర్లకు 10 వేలు గౌరవ వేతనం చేస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంపై ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రశ్నించారు. 2023 ఆగస్టు నుండి రాష్ట్రంలో వలంటీర్లు వ్యవస్థ లేదని దారుణంగా మాట్లాడుతున్నారు. ఆ వ్యవస్థ లేకపోతే ఎన్నికల మేనిఫెస్టోలో వాలంటీర్ల గురించి ఎలా పెట్టారు. 2024 ఏప్రిల్ నెలలో ఎన్నికల ప్రచారం ఊరూరా తిరిగి వాలంటీర్ల జీతాలు పెంచుతామని ఎలా హామీ ఇచ్చారని ప్రభుత్వాన్ని వరుదు కళ్యాణి నిలదీశారు. జీతం పెంచగానే చించినాడా పుతారేకులు ఇవ్వండి అని మంత్రి ప్రచారం చేశారు. ఏకంగా 2.6 లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించేయడం అన్యాయం అన్నారు. వాలంటీర్లు ఉపాధి కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారికి అన్యాయం చేయకూడదని కోరారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ.. వలంటీర్లు లేకపోతే విపత్తు శాఖ ఎందుకు ఆదేశాలు ఇచ్చిందని ప్రశ్నించారు. లేని వాలంటీర్ వ్యవస్థను వరదల సమయంలో ఎలా వినియోగించారని నిలదీశారు.

## థానేలో శివాజీ మహరాజ్ ఆలయం ప్రారంభం

- తీర్థయాత్రా స్థలంగా గుర్తింపు



**టీ మీడియా, మార్చి 17,భివండి:**
థానే జిల్లా భివండి పట్టణంలో ఉన్న మరాడేపాడా ఏరియాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆలయాన్ని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్? ప్రారంభించారు. హిందూ క్యాలెండర్ ప్రకారం శివాజీ జయంతి సందర్భంగా సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భివండిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం ఫడ్నవిస్ ప్రసంగించారు. "హనుమంతుడి దర్శనం లేకుండా శ్రీరాముడి దర్శనం పూర్తి కాదు. ఛత్రపతి శివాజీ మహారాజ్ దర్శనం లేకుండా ఏ దేవుడి దర్శనమూ మనకు ఎప్పటికీ ఫలించదు" అని ఆయన వ్యాఖ్యానించారు. "ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆలయం ఎందుకు అవసరం అయింది? ఎందుకంటే- ఆయన మనందరి మనసుల్లో సజీవంగా ఉన్నారు. మన దేశం కోసం, మన మతం కోసం శివాజీ మహారాజ్ యుద్ధం చేసి గెలిచారు. స్వరాజ్య సాధన కోసం ఆయన పోరాడారు. అందుకే ఇప్పుడు మీరు, నేను హిందువులుగా చెప్పుకోగలుగుతున్నాం. మన ఆరాధ్య దేవతలను చూడగలుగుతున్నాం" అని సీఎం ఫడణవీస్? పేర్కొన్నారు.


**రాజు చౌదరికి చేతులు జోడించి నమస్కరిస్తున్నా**
భివండి పట్టణంలో ఛత్రపతి శివాజీ ఆలయాన్ని నిర్మించినందుకు శివక్రాంతి ప్రతిష్ఠాన్‌కు చెందిన రాజు చౌదరికి దేవేంద్ర ఫడణవీస్? హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ఈ గొప్ప కార్యం చేసినందుకు రాజు చౌదరికి నేను చేతులు జోడించి నమస్కరిస్తున్నాను" అని సీఎం పేర్కొన్నారు. "ఈ ఆలయం చాలా అందంగా ఉంది. ఇక్కడ ఎత్తైన టవర్ ఉంది. సుందరమైన ప్రవేశ ద్వారం, తోట ప్రాంతం ఉన్నాయి. శివాజీ జీవితంలోని అన్ని సంఘటనలను మనం ఇక్కడ చూడొచ్చు. శివాజీ జననం నుంచి పట్టాభిషేకం వరకు, పులి దవడను ఛత్రపతి శంభాజీ మహారాజ్ విరిచిన క్షణం వరకు అన్ని ఘట్టాలను ఈ ఆలయంలో మనం చూడొచ్చు" అని ఫడణవీస్? తెలిపారు. "ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆలయానికి తీర్థయాత్రా ప్రదేశంగా అధికారిక గుర్తింపును ఇస్తాం. దీని దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం" అని ఆయన వెల్లడించారు.

**'ఔరంగజేబ్ సమాధిని కాపాడటం- చారిత్రక రికార్డుల కోసమే'**
"ఔరంగజేబ్ సమాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎందుకంటే అది రక్షిత ప్రదేశాల జాబితాలో ఉంది. దాన్ని రక్షించడంలో గౌరవభావానికి తావు లేదు. కేవలం చారిత్రక రికార్డుల కోసమే రక్షించాల్సి వస్తోంది" అని సీఎం ఫడణవీస్? చెప్పారు. "ఛత్రపతి శివాజీ ఆలయానికి మాత్రమే ప్రజల స్తుతిని పొందే అర్హత ఉంది. ఔరంగజేబ్ సమాధికి ఆ అర్హత లేదు. ఒకవేళ ఎవరైనా ఔరంగజేబును పొగిడే ప్రయత్నాలు చేస్తే అడ్డుకుంటాం" అని ముఖ్యమంత్రి వెల్లడించారు. "మహారాష్ట్రలోని 12 శివాజీ కోటలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలని కోరుతూ మేం యునెస్కోకు ప్రతిపాదనలు పంపాం. ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను మోసపూరితంగా బంధించిన సంగమేశ్వర్‌లో ఒక ప్యాలెస్‌ను నిర్మించాలని భావిస్తున్నాం. ఆగ్రా కోటలోని ఒక సెల్‌లో కొంతకాలం పాటు శివాజీ మహరాజ్‌ను బంధించారు. దాని నిర్వహణ బాధ్యతలను మహారాష్ట్ర సర్కారుకు ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని కోరాం. ఆ సెల్‌లో శివాజీ స్మారకం ఏర్పాటు చేస్తాం" అని దేవేంద్ర ఫడణవీస్? వెల్లడించారు.

**శివాజీ విగ్రహాన్ని చెక్కిన అరుణ్ యోగిరాజ్**
ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర సహాయ మంత్రి కపిల్ పాటిల్, ఎమ్మెల్యే కిషన్ రాథోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ జీవితంపై ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వీటిని సీఎం తిలకించారు. అయోధ్య రామయ్య విగ్రహాన్ని చెక్కిన శిల్పి అరుణ్ యోగిరాజ్- భివండిలోని శివాజీ ఆలయం కోసం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని చెక్కారు. ఈ ఆలయం నాలుగు ఎకరాల్లోని 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దాదాపు 5వేల చదరపు అడుగుల రాతి కంచెను ఆలయం చుట్టూ నిర్మించారు. ఆలయం పరిధిలో 36 ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగంలో మరాఠా సామ్రాజ్యపు ఒక్కో దశకు సంబంధించిన విశేషాల వర్ణన ఉంది.

## బీసీలకు 42 % రిజర్వేషన్

**బిల్లులకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం**




**టీ మీడియా,మార్చి 17,హైదరాబాద్ :**
బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ ఆమోదం లభించింది. బీసీలకు 42 % రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించింది. దీని ద్వారా విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 % రిజర్వేషన్ కల్పించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే, తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42 % రిజర్వేషన్ కల్పించే బిల్లును సైతం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. బిల్లులు ఆమోదం పొందిన అనంతరం శాసనసభ మంగళవారానికి వాయిదా పడింది.